కవర్ స్టోరీ

# లోగుట్టు సైన్సుకెరుక



**మానవ మేధస్సుకు అర్థం కానిది మాయ. శాస్త్రానికి అంతుచిక్కనిది బ్రహ్మపదార్థం. కానీ, సైన్స్ పరిధి పెరిగే కొలది.. మాయలన్నీ పటాపంచలు అవుతున్నాయి. బ్రహ్మపదార్థంలో గుట్టు బయటపడుతున్నది. టెక్నాలజీలో వస్తున్న మార్పులు పరిశోధనల్లో ముందడుగుకు కారణం అవుతున్నాయి. శాస్త్రవేత్తల నిరంతర అధ్యయనం ప్రపంచాన్ని కొత్తగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తున్నది. అంతరించిపోయిన మానవ కుటుంబాల గురించి తెలుసుకోవడం కావచ్చు.. ప్రాచీన అవశేషాల ఆధారంగా వారి జీవన విధానాన్ని అంచనా వేయడమే అవ్వొచ్చు.. మంచు మనిషి ఎలా జీవించాడు? రోమన్ కట్టడాలు అంత పటిష్ఠంగా ఎందుకు ఉంటాయి? మమ్మీలను భద్రపరచటానికి ఈజిప్షియన్లు ఏం చేసేవాళ్లు? ఇలాంటి కుతూహలాన్ని రేకెత్తించే ప్రశ్నలకు నేటి సైన్స్ పకడ్బందీగా సమాధానాలు రాబడుతున్నది. మనిషికి పంది గుండెను అమర్చడం, అసలు చెవిని పోలిన కొత్త చెవిని 3డీ ప్రింటింగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేపట్టడం, స్టీలు కంటే దృఢమైన పదార్థాన్ని కనుగొనడం ఇవన్నీ రాబోయే రోజుల్లో సైన్స్ అధిరోహించనున్న శిఖరానికి సోపానాలే!**

... ✍ డాక్టర్ పార్థసారథి చిరువోలు

గతాన్ని అర్థం చేసుకోవడంలో సైన్సు విప్లవాత్మకంగా మారుతున్నది. ఎముకలు, దుమ్ములో దాగి ఉండే డీఎన్ఏ ద్వారా అద్భుతమైన రహస్యాలు వెల్లడవుతున్నాయి. అలాగే కృత్రిమ మేధ ద్వారా మరుగునపడిన స్క్రిప్టులను అర్థం చేసుకోగలుగుతున్నారు. పళ్లు, వంటపాత్రలలో అవశేషాలను, భవన నిర్మాణ ఉత్పత్తులను రసాయనిక విశ్లేషణ చేయటం ద్వారా అప్పటి ప్రజలు తిన్న ఆహారం, ఇంటి నిర్మాణ పద్ధతులను అంచనా వేయగలుగుతున్నారు.

**200 ఏళ్ల తర్వాత తీరిన కోరిక**

జర్మన్ స్వరకర్త, పియానిస్టు, పాశ్చాత్య స్వరకర్తలందరిలోకి ప్రసిద్ధుడైన లుడ్విగ్ వాన్ బీథోవెన్ 1827లో కన్నుమూశాడు. అప్పటికి ఆయన వయసు 56 ఏళ్లు. మరణానికి పదేళ్ల ముందునుంచి అతను తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నాడు. వినికిడి లోపం, జీర్ణాశయ సమస్యలు, కాలేయ సమస్యలను ఎదుర్కొన్నాడు. దశాబ్దకాలం పాటు చెవిటివానిగానే మిగిలిపోయాడు. ప్రజల మధ్య ప్రదర్శనలు ఇవ్వటం మానేసి కంపోజింగ్‌లో మునిగిపోయాడు. ఆ సమయంలో రూపంలోనూ, ఆవిష్కరణలోనూ చిరకాలం నిలిచిపోయేలా సంగీతాన్ని ఆవిష్కరించాడు. అయితే ఇక్కడ బీథోవెన్ గురించి మనం చెప్పుకొంటున్న విషయం సంగీత రంగంలో ఆయన గొప్పతనం గురించి కాదు! 1802లో బీథోవెన్ తన సోదరులకు ఓ లేఖ రాశాడు. తను మరణించిన తర్వాతైనా తన అనారోగ్యానికి సరైన కారణం కనుగొనవలసిం

